వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



విద్యుత్‌ కాంతుల్లో ఆలయం

శామీర్‌పేట్: నేటి నుంచి మూడ్రోజుల పాటు ఉద్దమర్రి విష్ణు, శివాలయ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి విష్ణు, శివాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ విష్ణు, శివకేశవుల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

పలు టిప్పర్లకు జరిమానా

శామీర్‌పేట్: అక్రమంగా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి హెచ్చరించారు. మేడ్చల్‌జిల్లా, మూడుచింతలపల్లి మండలంలో అక్రమంగా మట్టితరలిస్తున్న టిప్పర్ లారీలను మండల రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి పట్టుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. కాగా తహసీల్దార్ 2 లారీలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. అనుమతులు లేకుండా మట్టితవ్వకాలు, రవాణ చేస్తే వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హత్య కేసు నిందితుడి రిమాండ్



మేడ్చల్: మంచి మాటలు చెప్పినందుకు ఆవేశంతో వరుసకు బావైన వ్యక్తి నడిరోడ్డుపై కిరాతకంగా కత్తితో పొడిచిన వ్యక్తిని మేడ్చల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ సరస్వతీనగర్‌లో నివాసం ఉండే మోతిలాల్‌ను అదే కాలనీకి చెందిన శంకర్‌గుజరాతి సోమవారం కత్తితో పొడిచాడు.. నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



జీఎం సునీల్‌తో కార్పొరేటర్ సునీత

అల్వాల్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ సునీత జలమండలి జీఎం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. పలు కాలనీలో పవర్‌బోర్లు పాడై నీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటికి మరమ్మత్తులు చేసి ప్రజలకు నీరు అందేలా చూడాలని కోరారు. పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పైపుల నిర్మాణాలు చేపట్టి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని విన్నవించారు. నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేతన వేతలు !

మూడు నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు ● పస్తులుండలేక అప్పులు చేయాల్సిన స్థితిలో వైద్య సిబ్బంది



వైద్యవిధాన పరిషత్ ఘట్‌కేసర్ ఆసుపత్రి భవనం

ఘట్‌కేసర్ : తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమయానికి వేతనాలు అందడం లేదు. 3 నెలలుగా జీతాలు అందక పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రిలో టెక్నీషియన్స్‌గా ఎక్స్‌రే, ల్యాబ్, ఈసీజీ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది అవుట్ సోర్సింగ్ కార్మికులుగా, పేషెంట్‌కేర్, ఆయాలు, సెక్యూరిటీగా వీరు విధులు నిర్వహిస్తుంటారు. ఆసుపత్రిలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెల సహా కాంట్రాక్ట్ ఉద్యోగులకు నేటికి వేతనాలు చెల్లించలేదు. నెలనెల వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు..

ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 20 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తుండగా.. జిల్లాలో వందలాది మంది పని చేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం..

కాంట్రాక్ట్ సిబ్బందికి 3 నెలలుగా వేతనాలు అందక కుటుంబపోషణ భారమై కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతినెల వేతనాలు చెల్లించాలని కోరినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన నిత్యవసర ధరలు..

పెరిగిన నిత్యవసర ధరలే కాకుండా మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా జూన్ మాసం వస్తుంది. పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు డ్రెస్సులు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయాలి. వేతనాలు పెండింగ్‌లో ఉంటే విద్యార్థుల చదువు, కుటుంబాల సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారులు స్పందించి నెలనెల వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతినెల వేతనాలు అందజేయాలి



ప్రజా ప్రతినిధులకు వేతనాలు, అలవెన్స్‌లకు నిధులు ఉంటాయి.. కానీ ఆసుపత్రిలో పనిచేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రం వేతనాలు ఇచ్చేందుకు నిధులు ఉండవు. రెక్కాడితే డొక్కాడని వీరికి నెలనెల వేతనాలు చెల్లించాలి.

– జయచంద్ర, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



ఏదులాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ వెంకట్‌రెడ్డి, డీఏఓ చంద్రకళ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని పరిశీలించి రైతులు, స్థానిక అధికారులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జ్‌ని ఆదేశించారు. ధాన్యంలో తేమ, తాలు, దుమ్ము, మట్టిపెడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు వాతావారణ సమాచారం ఇవ్వాలని సూచించారు.

మేడ్చల్: మేడ్చల్‌లో ప్రభుత్వం తరుపున నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ వెంకట్‌రెడ్డిలు అధికారులతో కలిసి సందర్శించారు. కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తగినంత హమాలీలను ఏర్పాటు చేయాలని, వడ్లు దింపే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైతులు అమ్మిన ధాన్యం డబ్బులు 48 గంటలలోగా వారి ఖాతాలో జమచేస్తున్నట్లు తెలిపారు. డీఏఓ చంద్రకళ, ఏఈఓ సుమితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన సందర్భంగా బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై ఉన్న వివేకానంద విగ్రహం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబట్టి ×భారత్ మాతాకీ జైⅪ ×జై జవాన్Ⅺ , ×జై కిసాన్Ⅺ.. అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, శైలజ, మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌ముదిరాజ్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడిపల్లి మండలంలో కులసంఘాల ఆత్మగౌరవ భవనాల కోసం రజకులకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో రాత్రికి రాత్రి గుడిసెలు వేసి రేవంత్‌రెడ్డి పేరు పెట్టి యదేచ్ఛగా కబ్జాలకు పాల్పడటం దారుణమని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. ఈ కబ్జాల వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మేడిపల్లి మండల పరిధిలోని మేడిపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 103లో రజకుల ఆత్మగౌరవ భవనం కోసం 2018లో 2.20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ.. గత ప్రభుత్వం జీవో నెంబర్ 20ను విడుదల చేసిందన్నారు. ఆ స్థలాన్ని రజకుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించడానికి పరిరక్షించాలని ఆయన కోరారు.

మెట్రోచార్జీలు తగ్గించాలి..

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వాహకులైన ఎల్‌అండ్‌టీ యాజమాన్యం ఇటీవల భారీగా పెంచిన మెట్రోచార్జీలను రద్దు చేయాలని సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. మెట్రో రైలు ప్రారంభానికి ముందు ఎల్‌అండ్‌టీ యాజమాన్యం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందానికి అదనంగా ఇప్పటికే చార్జీలు వసూలు చేస్తుందన్నారు. ప్రయాణికులపై ఇప్పటికే తీవ్రమైన భారం పడుతుందని, ఇలాంటి నేపథ్యంలో చార్జీలు పెంచడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 269 ఎకరాల భూమిని ఎల్‌అండ్‌టీ యాజమాన్యానికి ఇచ్చిందని, దీన్ని వ్యాపారీకరించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. రైలు భోగీలను పెంచడం ద్వారా అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు తగ్గిన విషయాన్ని గమనించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని పెంచిన మెట్రోచార్జీలను తగ్గించాలని కోరారు.

కొనసాగుతున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు



సోమారం సదస్సులో రైతులకు సూచనలు ఇస్తూ..

కీసర: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా కీసరలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాధవిలత, సందీప్, విక్రమ్, నిహారిక, ఏఈఓ రాజ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. చీడపీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రసాయన మందులను తక్కువ మోతాదులో వాడాలని సూచించారు. ఉద్యాన పంటలపై తీసుకోవాల్సిన మెళకువల గురించి చెప్పారు.

మేడ్చల్: మండలంలోని సోమారం గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఆధునిక వ్యవసాయం, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, సేంద్రియ ఎరువుల వాడకం, భూసారానికి తగినట్లుగా పంటలసాగు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సుధాన్షు, డాక్టర్ స్వామి, ఏఈఓ తేజస్విని రైతులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు కనీసం వేతనం చెల్లించాలి



కీసర ఆరోగ్యకేంద్రం వద్ద నిరసన చేస్తున్న ఆశావర్కర్లు

కీసర: ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఆశా యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు రాధ జయప్రద అన్నారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఆశావర్కర్లకు ఉద్యోగభద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం బడ్జెట్ పెంచాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాదమ్మ, శంకరమ్మ, రాణి, మంగ, పుణ్యవతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

- ఒడిశా, ఆదిలాబాద్ మీదుగా పూణెకు సరఫరా
- ఐదుగురి అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు



ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ, పోలీసులు

పోచారం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ చెప్పారు. సోమవారం రాత్రి ఘట్‌కేసర్‌లోని ఓఆర్‌ఆర్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. గంజాయి తరలిస్తున్న వాహనం పట్టుబడింది.మంగళవారం నారపల్లిలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు వివరాలను వెల్లడించారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేస్తుండగా.. ఔటర్‌రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద కర్ణాటకకు చెందిన ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. కారులోని ఐదుగురిని అదుపులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా డిక్కీలో గంజాయి ప్యాకెట్లు లభించాయి. వీటి మొత్తం బరువు సుమారు 59 కిలోలు ఉంటుంది. సుమారు రూ. 23.55 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితులు బీదర్‌కు చెందిన గోవింద్ తాపసలే (36), గజానంద్ (21), పవన్ (25), ఆకాశ్ (32), ఆదిలాబాద్‌కు చెందిన తోరత్ రాహుల్ (31)గా గుర్తించారు. వీరంతా కలిసి బీదర్ నుండి ఒడిశాలోని గజపతి జిల్లాలో ఉన్న సుమన్ జన్ని వద్దకు వెళ్లి, అక్కడ ఎండు గంజాయిని కిలో రూ. 1900 లకు కొనుగోలు చేసి కారులో భద్రాచలం, సూర్యాపేట, పంతంగి టోల్ ప్లాజా నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా ఘట్‌కేసర్ టోల్‌ప్లాజా ద్వారా రవాణా చేస్తుండగా.. పోలీసులకు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా పూణెలో ఉంటున్న అభిషేక్‌కు కిలో రూ. 5 వేలు చొప్పున రాహుల్ ద్వారా బీదర్‌కు చెందిన వ్యక్తులు అందజేయడానికి ఒప్పందం చేసుకున్నారు. నిందితుల వద్ద లభించిన గంజాయితో పాటు రూ. 5 లక్షల విలువైన కారు, రూ. 50 వేలు ఖరీదు చేసే 5 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమన్ జన్ని, అభిషేక్ పరారీలో ఉన్నారు. తనిఖీలను చాకచక్యంగా నిర్వహించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ జూపల్లి రవి, ఇన్‌స్పెక్టర్ సంగీత, ఎస్సై నందిని, ఇతర సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఎక్సైజ్‌శాఖ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ముకుందంరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నజర్ !

రైతులను నకిలీ విత్తనాల నుంచి అప్రమత్తం చేసేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయశాఖ సూచిస్తోంది.

– సాక్షి,సిటీబ్యూరో

జిల్లా, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలు

- నగర శివారుల్లో 350 పైగా విత్తన కంపెనీలు, ప్రాసెసింగ్ యూనిట్లు
- తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల డీలర్లకు విత్తనాల సరఫరా



విత్తన ప్రాసెసింగ్ యూనిట్ వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

టాస్క్‌ఫోర్స్ కమిటీల నియామకం..

ప్రతి ఏటా వర్షాకాలం పంటసాగు సీజన్‌కు ముందు జిల్లా, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించి, విత్తన కంపెనీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, డీలర్లకు విత్తనాలు సరఫరా చేసేందుకు నిర్వహిస్తున్న కార్యాలయాలపై తనిఖీలు నిర్వహిస్తోంది. ఒక్కోసారి ఈ తనిఖీలు మొక్కుబడిగా కొనసాగడం వల్ల విత్తన కంపెనీలు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు రైతులను మోసం చేస్తున్నాయి.

అసలు పోలినట్లుగా...

వర్షాకాలం పంటసాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు రైతులు కొనుగోలు చేస్తున్నారు. అదును చూసి అక్రమార్కులు రైతులను మోసం చేసేందుకు ముందుంటున్నారు. విత్తనాల ఒరిజినల్ ప్యాకెట్లను పోలినట్లు ముద్రించి విక్రయిస్తారు. ఇలాంటి విత్తన ప్యాకెట్లపై చిరునామా, తయారీ గడువు, తేదీ, లాట్ నెంబర్ ఉండవు. అసలు ధరకంటే తక్కువకు విక్రయిస్తారు. కొన్ని కంపెనీ ప్యాకెట్లు మార్కెట్లో ఉన్నవాటి మాదిరిగానే ఉంటాయి. పేరులో ఒక అక్షరం మాత్రమే తేడాగా ముద్రిస్తారు.

350కి పైగా విత్తన కంపెనీలు.. ప్రాసెసింగ్ యూనిట్లు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో పత్తి, మిర్చి, వరి, కూరగాయలు, ఇతర పంటలకు సంబంధించిన విత్తన కంపెనీలు ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తనాలను సరఫరా నిర్వహణకు సంబంధించిన ఆఫీసులు 350కి పైగా ఉన్నాయి. ఈ కంపెనీలు ప్రాసెసింగ్ కేంద్రాలన్నీ మేడ్చల్, శామీర్‌పేట, దుండిగల్, కీసర, ఘట్‌కేసర్ తదితర మండలాల పరిధిలో ఉంటాయి. ఈ విత్తన కంపెనీలు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు సరఫరా చేస్తారు. విత్తన డీలర్లు కంపెనీల నుంచి పొందిన విత్తనాలను షాపులు, ఏజెంట్ల ద్వారా రైతులకు విక్రయిస్తారు.

గతేడాది బయటపడిన నకిలీ విత్తనాలు..

శామీర్‌పేట మండలం అలియాబాద్‌తో సహా జిల్లాలోని పలు ప్రాంతాల్లో గతేడాది నకిలీ విత్తనాలు బయటపడ్డాయి. టాస్క్‌ఫోర్స్ కమిటీల్లో రైతు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే ఈ తనిఖీల వల్ల రైతులకు న్యాయం జరుగుతుందని, సీజన్ తనిఖీలతో ఉపయోగం ఉండదని పలువురు సూచనలు చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఎరువులు, విత్తనాల ప్యాకెట్లు, సంచులు ముందే విప్పి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే కొనుగోలు చేయకూడదు. కాలపరిమితి చెల్లిన విత్తనాలు కనిపిస్తే తక్షణమే వ్యవసాయశాఖకు సమాచారం ఇవ్వాలి. డీలర్ నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. నకిలీవని తేలితే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక చట్టం ప్రకారం విక్రయదారుడిపై కేసు నమోదు చేస్తాం.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మేడ్చల్ జిల్లా